ఆల్‌సోల్స్ డే కు అన్ని ఏర్పాట్లు చేయాలి

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని

బేగంపేట్ అక్టోబర్ 26: ఆల్ సోల్స్ డే(పవిత్ర ఆత్మల దినం)ను నవంబర్ 2న నిర్వహించనున్నామని, అన్ని ఏర్పాట్లు చేయాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. శనివారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బన్సీలాల్‌పేట్ డివిజన్ బోయిగూడ క్యాథలిక్ గ్రేవ్ యార్డ్‌లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై వివిధ శాఖల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆల్ సోల్స్ డే సందర్భంగా గ్రేవ్ యార్డ్‌కు వేలాది మంది వస్తారని, వారికి అన్ని వసతులు, సౌకర్యాలు కల్పించాలన్నారు. సమావేశంలో బన్సీలాల్‌పేట్ కార్పొరేటర్ హేమలత, బేగంపేట్ ఈఈ సుదర్శన్, వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వం డ్రైనేజీ సమస్యపై దృష్టి పెట్టాలి

- కేంద్ర మంత్రి జీ కిషన్‌రెడ్డి
- ఎమ్మెల్యే ముఠా గోపాల్‌తో కలిసి పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ముషీరాబాద్ క్రీడా మైదానంలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ తదితరులు

ముషీరాబాద్, అక్టోబర్ 26: రాష్ట్ర ప్రభుత్వ మూసీ సుందరీకరణ పక్కన పెట్టి బస్తీల్లో డ్రైనేజీ సమస్య పరిష్కారంపై దృష్టి సారించాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జీ.కిషన్‌రెడ్డి సూచించారు. మూసీ సుందరీకణ పేరిట పేదల ఇళ్లు తొలగిస్తామంటే ఊరుకనేది లేదని స్పష్టం చేశారు. శనివారం అడిక్‌మెట్, ముషీరాబాద్ డివిజన్లలో రూ 1.35 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులను స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. బస్తీల్లో ఓపెన్ డ్రైనేజీ ఉన్న చోట అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్ ఏర్పాటు, రోడ్లపై గుంతలు పూడ్చాలని అన్నారు. ఉన్నతాస్థాయి సమావేశం ఏర్పాటు చేసి నగరంలో నెలకొన్న ప్రధాన సమస్యలపై చర్చించాలని, అనంతరం నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో పనులు చేపట్టడానికి ఎవరూ ముందుకు రావడం లేదన్నారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడు తూ.. ముషీరాబాద్‌లో డ్రైనేజీ డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, వెంటనే నిధులు మంజూరు చేసి సమస్యను పరిష్కరించాలన్నారు.

కార్యక్రమంలో ముషీరాబాద్ కార్పొరేటర్ ఎం.సుప్రియానవీన్‌గౌడ్, డిప్యూటీ కమిషనర్ ఖాదర్ మోహినుద్దీన్, ఏఎంహెచ్‌ఓ ప్రవీణ, డిప్యూటీ ఈఈ సన్నీ, గీత, జలమండలి డీజీఎం మోహన్ రాజ్, బీఆర్‌ఎస్ నాయకులు ముఠా జయసింహా, సుధాకర్‌గుప్తా, బి.శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ నాయకులు ఎం నవీన్‌గౌడ్, పూస రాజు, రమేశ్‌రామ్, సీకే శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనివాస్ రామానుజన్ జయంతి

సదస్సులో మాట్లాడుతున్న ఓయూ వీసీ ప్రొఫెసర్ ఎం. కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 26: ప్రముఖ గణిత శాస్త్రవేత్త రామానుజన్ జయంతి వేడుకలను ఉస్మానియా యూనివర్సిటీ స్టాటిస్టిక్స్ విభాగంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (టీజీసీఓఎస్టీ) సహకారంతో 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ డేటా సైన్స్'అనే అంశంపై ఒక రోజు జాతీయ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఓయూ వీసీ ప్రొఫెసర్ ఎం. కుమార్ హాజరై మాట్లాడారు. గణిత రంగంలో రామానుజన్ చేసిన సేవలను కొనియాడారు. స్టాటిస్టిక్స్ విద్యార్థులు డేటా సైన్స్ రంగంలో రాణించగలుగుతారని అన్నారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కరుణసాగర్, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వీరయ్య, స్టాటిస్టిక్స్ విభాగం హెడ్ ప్రొఫెసర్ జయశ్రీ, ప్రొఫెసర్ భట్టాచార్యులు, ప్రొఫెసర్ కేవీఎస్, శర్మ, డాక్టర్ ఎం. విష్ణువర్ధన్ రావు, డాక్టర్ రఘునాథ ఆచార్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ గణిత దినోత్సవం

జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ మేథమేటిక్స్ విభాగంలో రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. రెండో రోజు శనివారం సదస్సు ముగింపునకు ముఖ్య అతిథిగా రిటైర్డ్ ప్రొఫెసర్ గోవర్ధన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణితంలో రామానుజన్ అందించిన సేవలను కొనియాడారు. ప్రస్తుతం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌లో గణిత విద్యార్థుల పాత్ర ఎంతో ఉంటుందని, తదనుగుణంగా విద్యార్థులు సిద్ధం కావాలని సూచించారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. సదస్సులో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వీరయ్య, మేథమేటిక్స్ హెడ్ ప్రొఫెసర్ కృష్ణారెడ్డి, ప్రొఫెసర్లు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

అధ్యాపకులు ఆధునిక సాంకేతికతను విద్యార్థులకు వివరించాలి

వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ సీవీ రంజని

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 26: ఆధునిక సాంకేతికతను అధ్యాపకులు ఎప్పటికప్పుడు నేర్చుకుని విద్యార్థులకు వివరించాలని పలువురు వక్తలు సూచించారు. శనివారం ఉస్మానియా యూనివర్సిటీ హ్యూమన్ క్యాపిటల్ డెవలప్‌మెంట్ సెంటర్ (హెచ్‌సీడీసీ) సహకారంతో ఫ్యాకల్టీ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో అధ్యాపకులకు 'అడ్వాన్స్‌డ్ ఎస్‌పీఎస్‌ఎస్, ఏఎంవోఎస్ అండ్ మెండలీ'పై ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో హెచ్‌సీడీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ సీవీ రంజని, ఫ్యాకల్టీ ఆఫ్ కామర్స్ డీన్ ప్రొఫెసర్ చెన్నప్ప, హెడ్ ప్రొఫెసర్ గంగాధర్, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ ప్రొఫెసర్ కృష్ణచైతన్య, విజ్ఞానజ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్. శ్రీనివాసరావు తదితరులు ప్రసంగించారు.

సీపీజీఈటీ చివరి దశ ప్రవేశాలకు షెడ్యూల్

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 26: రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన టీజీ సీపీజీఈటీ-24 సెట్ చివరి దశ ప్రవేశాలతో పాటు ఎంఈడీ, ఎంపీఈడీ కోర్సుల మొదటి దశ ప్రవేశాలకు షెడ్యూల్‌ను విడుదల చేసినట్లు ఇన్‌చార్జి కన్వీనర్ ప్రొఫెసర్ జలపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు అభ్యర్థులు ఈనెల 28 నుంచి వచ్చే నెల 1 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. 1వ తేదీన వెరిఫికేషన్ వివరాలను వెల్లడిస్తామని, 4వ తేదీ వరకు వెబ్‌ఆప్షన్లను ఎంపిక చేసుకోవాలని, 4న ఎడిట్ చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ప్రాథమిక సీట్ల కేటాయింపు జాబితాను 8న విడుదల చేస్తామని, అభ్యర్థులు తమకు కేటాయించిన కళాశాలలో 12లోగా రిపోర్టు చేయాల్సి ఉంటుందని వివరించారు.

వివిధ డిగ్రీ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 26: ఓయూ పరిధిలోని వివిధ డిగ్రీ కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకామ్, బీఎస్సీ, బీఎస్సీ ఆనర్స్, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ తదితర కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యూలర్ పరీక్ష ఫీజును వచ్చే నెల 7లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని పేర్కొన్నారు. రూ.500 అపరాధ రుసుముతో 11 వరకు చెల్లించవచ్చన్నారు. పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

'కేజ్రీవాల్‌ను చంపేందుకు బీజేపీ కుట్ర'

ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు

చిక్కడపల్లి, అక్టోబర్ 26 : ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్,ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ను చంపేందుకు బీజేపీ కుట్ర పన్నుతోందని, అందులో భాగంగానే ఆయనపై బీజేపీ యువ మోర్చా గుండాలతో దాడి చేయించిదని ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆరోపించారు. అరవింద్ కేజ్రీవాల్‌పై దాడిని నిరిసిస్తూ శనివారం ట్యాంట్‌బండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ.. అరవింద్ కేజ్రీవాల్ పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నిరసనలో ఆప్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు రాము గౌడ్, మాజిద్, సోలొమన్‌రాజ్, హేమ, నర్సింగ్, యమునాగౌడ్, జావిద్, షరీఫ్, అఫ్స సలాం, కాలింబాబా, నాయకులు శివాజీ, శ్రీనివాస్, ఇస్మాయిల్, రాకేశ్ సింగ్,సుధారాణి, మౌనిక పాల్గొన్నారు.

మాలలకు వీసీ పదవులు ఇవ్వాలి

- మాల ప్రజా సంఘాల డిమాండ్

నిరసన తెలుపుతున్న మాల ప్రజా సంఘాల ప్రతినిధులు

అమీర్‌పేట్, అక్టోబర్ 26: ఓట్లేసి గెలిపించిన మాలలకు రేవంత్‌రెడ్డి సారథ్యంలోని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తున్నదని మాల ప్రజా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. వీసీల నియామకాల్లో మాలలకు తీవ్ర అన్యాయం జరిగిందని, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, జేఎన్‌టీయూలకు వీసీలుగా మాలలనే నియమించాలని డిమాండ్ చేస్తూ శనివారం హైదరాబాద్‌లో ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్(అంసా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. లింగస్వామి ఆధ్వర్యంలో మాల ప్రజా సంఘాల సమావేశం జరిగింది. మాల మహానాడు జాతీయాధ్యక్షుడు జి. చెన్నయ్య, రాష్ట్ర అధ్యక్షుడు బీ. వెంకటేశ్వర్లు, నాయకులు రవి, రాంచందర్, బేర బాలకిషన్, జీ.శ్రీను, వెంకన్న, నర్సింహయ్య పాల్గొని ప్రసంగించారు. జి.చెన్నయ్య మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన తరువాత కాంగ్రెస్ పార్టీ మాలలను పూర్తిగా విస్మరించిందన్నారు. ప్రత్యేకించి వీసీల నియామకాల్లో మాల ప్రొఫెసర్ ఒక్కరూ లేకపోవడం శోచనీయమన్నారు. ఇంకా వీసీలను ప్రకటించని, అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ, జేఎన్‌టీయూలకు మాల ప్రొఫెసర్లనే వీసీలుగా నియమించాలని డిమాండ్ చేశారు. లేకుంటే వచ్చే పంచాయతీ, జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని చిత్తుగా ఓడిస్తామని ఆయన హెచ్చరించారు.

షూటింగ్ చాంపియన్ సయ్యద్ మునావర్

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ) వేదికగా జరిగిన స్పోర్ట్స్ ఫర్ ఆల్(ఎస్‌ఎఫ్‌ఏ) షూటింగ్ చాంపియన్‌షిప్‌లో యువ షూటర్ సయ్యద్ మునావర్ హుస్సేన్ 10మీటర్ల విభాగంలో స్వర్ణ పతకంతో మెరిశాడు.

ఏషియన్ ముక్తా సంస్థలకు టోకరా

బోగస్ బ్యాంక్ అకౌంట్లతో ఉద్యోగి మోసం

సినీ నిర్మాత ఫిర్యాదుతో ముగ్గురిపై కేసు

బంజారాహిల్స్, అక్టోబర్ 26: బోగస్ కంపెనీల పేర్లతో బ్యాంక్ అకౌంట్లను సృష్టించి.. ప్రముఖ సినీ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ సునీల్ నారంగ్‌కు చెందిన అకౌంట్ నుంచి డబ్బులు కాజేసిన ఉద్యోగితో పాటు మరో ఇద్దరిపై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదయింది. పోలీసుల వివరాల ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్ నం. 31లో ఏషియన్ ముక్తా ఏ-2 సంస్థ పేరుతో నిర్మాత సునీల్ నారంగ్ కార్యాలయం నడిపిస్తున్నారు. ఇందులో విశ్వనాథరెడ్డి అనే వ్యక్తి గత ఏడేళ్లుగా అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. కాగా.. గత కొన్నేళ్లుగా విశ్వనాథరెడ్డి.. తన భార్య సఫియా నసీర్, స్నేహితుడు శశాంక్‌తో కలిసి కొన్ని బోగస్ సంస్థల పేర్లతో బ్యాంక్ అకౌంట్లు తెరిచారు. హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్, సాయి నైన్ ఎంటర్‌ప్రైజెస్, తదితర పేర్లతో ఉన్న ఈ బ్యాంకు ఖాతాలకు పలు సందర్భాల్లో డబ్బులు పంపించారు. బోగస్ లెక్కలు చూపిస్తూ ఆయా సంస్థల పేర్లమీదకు రూ.1.47కోట్ల మేర నిధులు పంపించినట్లు ఇటీవల నిర్వహించిన ఆడిట్‌లో తేలింది. ఏషియన్ సంస్థ సీఎఫ్‌వో రాజశేఖర్ యాదవ్, సీఈవో వరుణ్ మల్హోత్రా, మేనేజింగ్ పార్టనర్ సునీల్ నారంగ్ పేర్లతో చెక్కులు తీసుకుని డబ్బులు తమ ఖాతాల్లోకి మళ్లించినట్లు తేలింది. దీంతో తమ సంస్థను మోసం చేసిన విశ్వనాథరెడ్డితో పాటు సఫియా నసీర్, శశాంక్, తదితరులపై చర్యలు తీసుకోవాలంటూ నిర్మాత సునీల్ నారంగ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అద్దెకు ఇచ్చిన ఇల్లు కూల్చివేత

అడ్డుకునేందుకు జేసీ దివాకర్‌రెడ్డి వెళ్తే బెదిరింపులు

కేసు నమోదు చేసిన పోలీసులు

బంజారాహిల్స్,అక్టోబర్ 26: తమ వద్ద అద్దెకు తీసుకున్న ఇంటిని.. వేరొకరికి ఇచ్చే ప్రయత్నాల్లో భాగంగా కూల్చివేతలు చేపట్టడంపై ప్రశ్నించేందుకు వెళ్లిన మాజీ మంత్రి జేసీ దివాకర్‌రెడ్డి, మేనేజర్‌లను బెదిరింపులకు గురిచేయడంతోపాటు దాడికి యత్నించారు. ఈ సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత జేసీ దివాకర్‌రెడ్డికి జూబ్లీహిల్స్ రోడ్ నం.62లోని ప్లాట్ నంబర్ 1250లో ఉన్న ఇంటిని సాహితీ సంస్థ చైర్మన్ బూదాటి లక్ష్మీనారాయణకు 2020లో అద్దెకు ఇచ్చాడు. మూడేళ్ల గడువు ముగిసిన తర్వాత ఇంటిని ఖాళీ చేయాలని కోరగా.. బూదాటి కొడుకు సాత్విక్ మిస్టిక్ వెల్‌నెస్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఓ బోగస్ అగ్రిమెంట్‌ను సృష్టించి కోర్టులో కేసు వేశాడు. ఈ వ్యవహారంపై గతంలోనే సివిల్, క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇదిలా ఉండగా వారం రోజుల క్రితం జేసీ దివాకర్‌రెడ్డితోపాటు అతడి మేనేజర్ జగదీశ్ యాదవ్‌లు ప్లాట్ నంబర్ 1250లో ఉన్న ఇంటి వద్దకు వెళ్లారు. అక్కడ ఉన్న ఇంటిని కూల్చేసి స్థలాన్ని చదును చేస్తున్నట్లు గుర్తించిన జేసీ షాక్‌కు గురయ్యారు. ఏడాది కాలంనుంచి అద్దె చెల్లించకపోవడంతో పాటు కోర్టులో తప్పుడు పత్రాలతో కేసులు వేశారని, తమ అనుమతి లేకుండా ఇంటిని ఎలా కూలుస్తారంటూ అక్కడున్న రాజీవ్ సాల్మన్ అనే వ్యక్తిని ప్రశ్నించారు. దీంతో రాజీవ్ సాల్మన్‌తో పాటు ఇతర వ్యక్తులు జేసీ దివాకర్‌రెడ్డి, జగదీశ్ యాదవ్‌లను అక్కడినుంచి వెళ్లిపోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇంటిని కూల్చిన ఫొటోలు తీసేందుకు యత్నించడాన్ని అడ్డుకున్నారు.ఈ స్థలాన్ని సినిమా వాళ్లకు అద్దెకు ఇచ్చారని, ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేసేందుకు యత్నిస్తున్నారంటూ జగదీశ్‌యాదవ్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సీట్లు, ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ మోసం

బంజారాహిల్స్, అక్టోబర్ 26: మెడికల్, ఇంజినీరింగ్ సీట్లు, ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నమ్మించి పలువురు బాధితుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసిన మోసగాడిపై జూబ్లీహిల్స్ పోలీసులు చీటింగ్ కేసులు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. శ్రీనగర్ కాలనీలో రోహిత్ అనే వ్యక్తి ఆరునెలల క్రితం చెక్‌మేట్ కన్సల్టెన్సీ పేరుతో కార్యాలయం ఏర్పాటు చేశాడు. విదేశాల్లో మెడిసిన్ సీట్లు, మేనేజ్‌మెంట్ కోటాలో ఇంజినీరింగ్ సీట్లు ఇప్పిస్తానంటూ నమ్మించి పలువురివద్దనుంచి లక్షలాది రూపాయలు వసూలు చేశాడు. అయితే నెలలు గడిచినా సీట్లు రాకపోవడంతో పాటు రోహిత్ బిచాణా ఎత్తేయడంతో శనివారం పలువురు బాధితులు పోలీసులకు ఫిర్యాదులు చేశారు. రంగారెడ్డి నగర్‌కు చెందిన పరశురామ్ కుమార్తెకు ఈ కాలేజీలో మేనేజ్‌మెంట్ కోటా కింద సీటు ఇప్పిస్తానంటూ రూ.12లక్షలు వసూలు చేసి మోసం చేశాడు. కృష్ణదేవరాయనగర్‌కు చెందిన పాగల నందిని వద్దనుంచి విదేశాల్లో ఉద్యోగం పేరుతో రూ.7లక్షలు వసూలు చేయగా, శ్రీనగర్ కాలనీకి చెందిన రచ్చ నవిత కుమార్తెకు వైజాగ్‌లోని గీతం యూనివర్సిటీలో ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తానంటూ రూ.15లక్షలు వసూలు చేశాడు. ఆఫీసు ఏర్పాటు కోసం అంటూ అనురాధ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న రావి గౌతమి వద్దనుంచి రూ.70లక్షలు తీసుకున్న రోహిత్.. వివిధ కారణాలు చెబుతూ కాలయాపన చేశాడు. ఇటీవల గట్టిగా డబ్బులు ఇవ్వాలని కోరగా బాండ్ పేపర్ రాసిచ్చి అక్టోబర్ 25లోగా ఇస్తానంటూ హామీ ఇచ్చాడు. అయితే డబ్బులు ఇవ్వకపోగా ఆఫీసు మూసేసి పరార్ కావడంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా చీటింగ్ కేసులు నమోదు చేశారు. రోహిత్ చేతిలో మోసపోయిన బాధితులు వందల సంఖ్యలో ఉన్నారని స్థానికులు చెబుతున్నారు. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గాంధీ దవాఖానను సందర్శించిన డీఎంఈ

గాంధీ దవాఖానలో వైద్యాధికారులతో మాట్లాడుతున్న డీఎంఈ డాక్టర్ వాణి

బన్సీలాల్‌పేట్, అక్టోబర్ 26 : గాంధీ దవాఖానాను శనివారం డీఎంఈ డాక్టర్ ఎన్. వాణి సందర్శించారు. ఓపీ బ్లాక్‌కు వెళ్లి రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. అనంతరం ఫార్మసీలో మందులను పరిశీలించారు. వైద్యులు రాసిన మందులను రోగులకు సరిగ్గా ఇస్తున్నారా? అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఎంఈ మా ట్లాడుతూ.. ప్రస్తుతం అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. అత్యవసర మందుల కొనుగోలుకు సైతం దవాఖానలో నిధులు ఉన్నట్లు తెలిపారు. దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి, డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ సునీల్ కుమార్, డాక్టర్ సుబోధ్, ఆర్‌ఎంఓ డాక్టర్ శేషాద్రి పాల్గొన్నారు.

లా కోర్సుల ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 26: ఓయూ పరిధిలోని వివిధ లా కోర్సుల పరీక్షా ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌బీ ఆనర్స్, ఐదేళ్ల బీఏ ఎల్‌ఎల్‌బీ, బీబీఏ ఎల్‌ఎల్‌బీ, ఐదేళ్ల బీకామ్ ఎల్‌ఎల్‌బీ తదితర కోర్సుల నాలుగు, ఆరు, ఎనిమిదో సెమిస్టర్ రెగ్యూలర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు తమ మార్క్స్ మెమోలను వచ్చే నెల 4 తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రీవాల్యుయేషన్ కోసం ఒక్కో పేపర్‌కు రూ.700 చెల్లించి వచ్చే నెల 9లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి వచ్చే నెల 23 లోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని తెలిపారు.

పేదలకు వైద్య సాయం అందించేందుకు కృషి

- సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

బాధితులకు ఎల్‌ఓసీ పత్రాలను అందజేసిన ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్, అక్టోబర్ 26 : పేదలకు వైద్య సాయం అందించేందుకు కృషి చేస్తానని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావుగౌడ్ అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గం వారాసిగూడకు చెందిన షమీమ్ ఖాతూన్, తార్నాకకు చెందిన చరితరెడ్డి, సూరిబాబు అనారోగ్యం తో బాధపడుతూ చికిత్స కోసం ఆర్థిక సాయం అందించాలని ఎమ్మెల్యేను ఆశ్రయించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే వారికి వైద్య ఖర్చుల నిమిత్తం దాదాపు రూ. ఆరు లక్షల వరకు ఎల్‌ఓసీ పత్రాలను ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరు చేయించారు. శనివారం సాయంత్రం సీతాఫల్‌మండిలోని తన కార్యాలయంలో బాధితులకు ఎల్‌ఓసీ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం సహాయ నిధి ద్వారా పేదలకు అండగా నిలుస్తున్నామన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి : ఎమ్మెల్యే

సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ అధికారులను ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ నూతన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పేర్రాజు నేతృత్వంలోని ఇంజినీరింగ్ అధికారుల బృందం శనివారం సాయంత్రం సీతాఫల్‌మండిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌తో సమావేశమైంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆల్ సోల్స్ డేను పురస్కరించుకొని క్రిస్టియన్ శ్మశానవాటికల్లో సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో ఈఈ పేర్రాజు, డీఈఈ స్వర్ణలత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

21 నుంచి 'వాటర్ - ది న్యూ కరెన్సీ' సదస్సు

జ్యోతి వెలిగించి సమావేశాన్ని ప్రారంభిస్తున్న ప్రతినిధులు

అమీర్‌పేట అక్టోబర్ 26 : ప్లంబింగ్ పరిశ్రమ నిపుణుల సారథ్యంలో 30వ ఇండియన్ ప్లంబింగ్ కాన్ఫరెన్స్ నవంబర్ 21 నుంచి 23 వరకు హైటెక్స్‌లో జరగనుంది. 'వాటర్ -ది న్యూ కరెన్సీ' అనే అంశంపై నిర్వహించనున్న ఈ సదస్సుకు సంబంధించిన అంశాలను ఐపీఏ జాతీయ అధ్యక్షుడు గుర్మీత్‌సింగ్ శుక్రవారం రాత్రి అమీర్‌పేట్‌లోని హోటల్ మారిగోల్డ్‌లో నిర్వహించిన సమావేశంలో తెలిపారు. ఈ సదస్సులో 80 మంది ఎగ్జిబిటర్లు తమ ఉత్పత్తులను, సేవలను ప్రదర్శించనున్నారు. దేశ విదేశాల నుంచి 1500 మంది ప్లంబింగ్ నిపుణులతో పాటు 5 వేల మందికి పైగా సందర్శకులు హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా 'వాటర్ ఎకానమీ' అనే అంశంపై జరిగిన ప్యానెల్ డిస్కషన్‌లో ఐపీఏ హైదరాబాద్ చాప్టర్ వైస్ చైర్మన్ శ్రవణ్‌కుమార్, తెలంగాణ ఆర్ అండ్ బీ సీఈ లింగారెడ్డి, ఐఐఏ తెలంగాణ చాప్టర్ చైర్మన్ వీవీఎల్ నరసింహన్‌తో పాటు వివిధ సంస్థలకు చెందిన అవినాశ్ మిశ్రా, విజయసాయి, శేఖర్‌రెడ్డి, ఎంకేఆర్ సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగాలను వదిలించుకునే ప్రక్రియలో కేంద్రం

మహాసభల్లో మాట్లాడుతున్న ఏఐఐఈఏ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మిశ్రా

చిక్కడపల్లి,అక్టోబర్ 26: ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ హైదరాబాద్, సికింద్రాబాద్ డివిజన్ల 23వ సంయుక్త మహాసభలు శనివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్(ఏఐఐఈఏ) జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మిశ్రా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం సరళీకరణ విధానాల్లో భాగంగా ప్రభుత్వ రంగాలన్నింటినీ వదిలించుకునే ప్రక్రియలో ఉందని విమర్శించారు. కేంద్రం ఇటీవల యూనివర్సల్ పెన్షన్ విధానాన్ని ప్రకటించిందనీ, ఇందులో కార్మికులకు ఎలాంటి ప్రయోజనంలేదని పాత పెన్షన్ విధానాన్ని అందరికీ వర్తింప చేయాలని పిలుపునిచ్చారు. సంఘం హైదరాబాద్ డివిజన్ అధ్యక్షుడు ఎల్.మద్దిలేని, ప్రధాన కార్యదర్శి జి.తిరుపతయ్య,సికింద్రాబాద్ డివిజన్ అధ్యక్షుడు ఎస్. గుణశేఖర్, ప్రధాన కార్యదర్శి డీఎస్ రఘు, వేణుగోపాల్, బీఎస్ రవి, కేఎస్ రాజశేఖర్, సతీశ్, సుజాత, రవీంద్రనాథ్, శ్రీనివాస్ తదిత రులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఏ వాలీబాల్ చాంప్ ఆర్మీ పబ్లిక్ స్కూల్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: స్పోర్ట్స్ ఫర్ ఆల్(ఎస్‌ఎఫ్‌ఏ) వాలీబాల్ చాంపియన్‌షిప్‌లో బొల్లారం ఆర్మీ పబ్లిక్ స్కూల్ విజేతగా నిలిచింది. శనివారం నిర్వహించిన బాలికల అండర్-14 ఫైనల్లో ఆర్మీ పబ్లిక్ స్కూల్..విజ్ఞాన్ బో ట్రీపై గెలిచి పసిడి పతకం సొంతం చేసుకుంది. హ్యాండ్‌బాల్ బాలుర అండర్-10 తుదిపోరులో జనప్రియ హైస్కూల్..విజ్ఞాన్ బో ట్రీపై విజయం సాధించింది. యూసుఫ్‌గూడ ఇండోర్ స్టేడియంలో కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఈ ఏడాది ఎస్‌ఎఫ్‌ఏ చాంపియన్‌షిప్‌లో 920 పాఠశాలల నుంచి 23వేల మంది ప్లేయర్లు 22 క్రీడల్లో పోటీపడుతున్నారు.

వివిధ కోర్సుల పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 26 : ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు యూనివర్సిటీ ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. దూరవిద్య ద్వారా అందించే అడ్వాన్స్‌డ్ డిప్లొమా ఇన్ బయో ఇన్ఫర్మేటిక్స్, అడ్వాన్స్‌డ్ డిప్లొమా ఇన్ మ్యాథ్స్/ఈఎల్‌టీ/బీఎం, డిప్లొమా, అడ్వాన్స్‌డ్ పీజీ డిప్లొ మా ఇన్ వేదిక్ ఆస్ట్రాలజీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షలను వచ్చే నెల 12 నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా తేదీల వివరాలను ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవాలన్నారు.

కుట్టు శిక్షణా కేంద్రం ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ: ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా తార్నాక డివిజన్ మాణికేశ్వరీనగర్‌లో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణా కేంద్రాన్ని నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డీపీవో శ్రీనాథ్, శ్రీవాణి, సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ సభ్యులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

దక్షిణాదికి కాంగ్రెస్ ఏం చేసిందో రేవంత్ చెప్పాలి

- ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్

మాట్లాడుతున్న ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 26: దేశాన్ని సుమారు యాభయ్యేండ్లు పాలించిన కాం గ్రెస్ పార్టీ దక్షిణాదికి ఏం చేసిందో? ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పాలని దక్షిణ భారత జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. తన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉత్తరాది పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ దక్షిణాదికి తీరని ద్రోహం చేశారని మండిపడ్డారు. హైదరాబాద్‌ను దేశ రెండో రాజధానిగా చేయాలని, సుప్రీం బెంచ్‌ను చెన్నైలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఏపీకి ప్రత్యేక హోదా కల్పించాలని, తెలంగాణ, కేరళ, కర్ణాటక, తమిళనాడుకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలన్నారు. ప్రియాంక గాంధీని చిత్తుగా ఓడించి కేరళ ఆత్మగౌరవాన్ని నిలబెట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

చిక్కడపల్లి : ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని అరోరా డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం 'అభియాన్' పేరుతో కల్చరల్ ఫెస్ట్ నిర్వహించారు. 'ఆట' ఫేమ్ సందీప్ విద్యార్థులతో కలిసి సందడి చేశారు.

చిక్కడపల్లి : బాగ్‌లింగంపల్లి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు శనివారం ఎంఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్లడ్ క్యాన్సర్ అవేర్‌నెస్ ర్యాలీలో పాల్గొన్నారు.

నర్సింగ్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలి

అమీర్‌పేట్, అక్టోబర్ 26: తెలంగాణలో నర్సింగ్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కృషి చేయాలని ది ట్రైన్డ్ నర్సెస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (టీఎన్ఎఐ) దక్షిణ ప్రాంత ఉపాధ్యక్షుడు డాక్టర్ జెయినీ కెంప్ పేర్కొన్నారు. ది ట్రైన్డ్ నర్సెస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా 5వ ద్వైవార్షిక సదస్సు శనివారం సనత్‌నగర్‌లోని సెయింట్ థెరిస్సా స్కూల్ ఆవరణలోని జేఎంజే స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో ఘనంగా జరిగింది. టీఎన్ఏఐ తెలంగాణ అధ్యక్షుడు డాక్టర్ ఎం.రాజేశ్వరి అధ్యక్షతన 'లీడర్‌షిప్ ఇన్ నర్సింగ్ ః ఇన్‌స్పైరింగ్ విజన్, డ్రైవింగ్ చేంజ్' అనే అంశంపై సదస్సు జరిగింది. రాష్ట్ర నలుమూలల నుంచి 300 మందికి పైగా ప్రతినిధులు తరలివచ్చారు. సైంటిఫిక్ పేపర్, పోస్టర్ ప్రెజెంటేషన్ జరిగింది. ప్యానెల్ డిస్కషన్‌లో టీఎన్ఏఐ ప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

అభినందన..

విస్టా ఇంటర్నేషనల్ స్కూల్ స్పోర్ట్స్ మీట్‌లో విజేతలను శనివారం అభినందిస్తున్న భారత మాజీ వాలీబాల్ ప్లేయర్ కిరణ్‌రెడ్డి